## అన్నివిధాలా అల్లుడు మంచివాడయితే అమ్మాయి పుట్టింటికి ఎందుకొచ్చింది?

రాగతిరమ
కథ

# అమ్మా చూడే

దబదబమని తలుపు చప్పుడు.

తలుపు తీసింది నీలమ్మ. ఎదురుగా తార. చేతిలో సూట్‌కేస్. నీలమ్మ ఆశ్చర్యంగా చూసింది.

"ఎవరు?" అంటూ వచ్చారు రావుగారు.

రేగిన జుత్తు! ఎర్రబడ్డ కళ్ళు. ఇంట్లోకి అడుగుపెడుతూనే బావురుమంటూ రెండు చేతుల్లో మొఖం దాచుకుంది తార. నీలమ్మ గుండె తరుక్కుపోయింది.

"ఏమైందే తల్లీ?" అంది కూతుర్ని అక్కున చేర్చుకొని.

"నా గొంతు కోసేసారమ్మా మీరు!" వెక్కిళ్ళు పెడుతూ వుంది తార. రావుగారి కాళ్ళు వణికాయి. కూతురి పెళ్ళై ఆరునెల్లు అవలేదు. అయితే అల్లుడు అష్టావక్రుడన్న మాట!

తల్లీ కూతుళ్ళు ఇద్దరూ ఒకర్నొకరు పట్టుకొని గొల్లుమని ఏడుస్తూ సోఫాలో కూర్చున్నారు.

"అమ్మాయిని వూరుకోపెట్టడం పోయి నువ్వెందుకే మధ్యలో ఏడుపు? అసలు సంగతేమిటో కనుక్కో"? అన్నారు రావుగారు కోపంగా.

"అమ్మాయ్ అల్లుడు తాగుబోతేమిటే? అడిగింది మెల్లగా.

"లేదమ్మా" అంది వెక్కుతూనే తార.

"పోనీ చీటికి మాటికి చిరాకుపడతాడా?" అడిగారు రావుగారు.

"లేదు నాన్నా" అంది తార.



"ఆడోళ్ళతో షికార్లు చేసే రకమేమి టే?" అంది వీలమ్మ. తల అడ్డంగా తిప్పింది తార.

"కట్నం డబ్బు చాలలేదని చిందులేస్తున్నాడేటమ్మా"? అన్నారు రావుగారు.

"కాదు నాన్నా" అంది తార పొర్లి వచ్చే దుఃఖానాపుకుంటూ.

"సారే చీర తక్కువైందన్నాడేమిటమ్మా?" అంది నీలమ్మ.

"ఊహు లేదమ్మా" అంది తార ముక్కు తుడుచుకుంటూ.

"కొడతాడేమిటే?"

"నిన్నేమన్నా కించపరుస్తాడా అమ్మా అదే పనిగా చెప్పు వాడి పని పడతాను?"

"ఆఫీసునుండి అర్ధరాత్రి ఇంటికొస్తాడేమిటే?"

"పోనీ, నువ్వొండిన కూరలన్నింటికి వంకలు పెట్టి ఎగతాళి చేస్తాడేమిటమ్మాయ్!"

అన్నింటికి తల అడ్డంగా తిప్పుతూనే వుంది తార. కానీ ఏడుస్తూనే వుంది.

"మరి మాకెలా తెలుస్తుందే నువ్వు చెప్పకపోతే"— అన్నారు రావుగారు, నీలమ్మ కొద్దిగా చిరాగ్గా.

తార కళ్ళొత్తుకొని నోరు విప్పింది మెల్లిగా.

"లేదమ్మా ఒక మగాడు కుండవలసిన లక్షణాలు ఒక్కటీ లేవు.

రావుగారూ, నీలమ్మా 'ఆ' అంటూ నోరు తెరిచారు.

"అవునమ్మా మగవాడి లక్షణాలు ఒక్కటీ లేవు. తను అవును అంటే నేను కాదు అన్నాననుకో, సరేలే అని వూరుకుంటాడేగాని అది ఎందుకు కాదు, ఎలా కాదో అడగడే! తనుఫలానా సినిమాకెళ్దాం అంటే! నేను ఇంకోటంటాను. వెంటనే సరే అని గంగిరెద్దులా తలూపుతాడే!

ఇక సెలవు రోజువస్తే — గరిట పుచ్చుకొని ఆడంగి వెధవలా వంటింట్లోకి వచ్చి కూరలు వండటానికి తయారుపడతాడే! పొద్దుట లేవడం చిటిక ఆలస్యం అయిందా తనే వెళ్ళి టీ కలుపుకొస్తారమ్మా! పచ్చడి రుబ్బడానికి కూర్చుంటాను — అంతే నేనే రుబ్బుతానని తయారు పడతారమ్మా! అన్నీ ఆడంగి పనులే! ఇరుగూ పొరుగూ ఆడంగి మొగుడూ అని పేరుపెట్టి బుగ్గలు నొక్కుకుంటున్నారమ్మా!" అంది తార వలవలా ఏడుస్తూ.

*

